క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మ వారిచే దక్షిణామూర్తి వైభవంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా పోరాటాలకు విరాళాలివ్వండి



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: ప్రజా పోరాటాలకు విరాళాలు ఇచ్చి సహకరించాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు, తాలూకా కార్యదర్శి ప్రతాప్ కోరారు. శనివారం వారు ఆత్మకూరులో విరాళాలు సేకరించారు. జూలై 6న ఆత్మకూరులో జరిగే మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు చాంద్, లల్లు, షేక్షావలి, చాంద్‌బాషా, నాగన్న, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

ఆత్మకూరు: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని కరివేన గ్రామంలోని ఎస్‌ఆర్‌బీసీ కాలనీలోని మానవతా వృద్ధాశ్రమంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని టీబీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం తగ్గకపోతే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు.

శ్మశాన వాటికకు తాత్కాలిక దారి ఏర్పాటు



శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటికకు శనివారం తాత్కాలిక దారి పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి లేకపోవడంతో మృతదేహాలను తీసుకెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందు ఎదుర్కొనేవారు. సమస్యను జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎంపీపీతో మాట్లాడి నిధులను మంజూరు చేయించారని సర్పంచు వరప్రసాదరావు తెలిపారు. రాళ్లు, మట్టితో తాత్కాలికంగా రహదారి నిర్మాణ పనులు చేయిస్తున్నామన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కె.దినేష్‌కుమార్

ఆత్మకూరు: పట్టణంలో పదో తరగతికి అనుమతి లేకుండా నడుపుతున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, మండల అధ్యక్షులు సాయి డిమాండ్ చేశారు. శనివారం డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో వారు సమావేశమై మాట్లాడారు. ఆత్మకూరులోని ప్రయివేట్ పాఠశాలల్లో యూపీ స్కూల్ అనుమతితో హైస్కూల్ నడుపుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంత జూటూరు గ్రామంలో శనివారం గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణ కోసం ఉచితంగా వ్యాక్సిన్‌లు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ అనూష మాట్లాడుతూ జీవాల యజమానులు వెంటనే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవాలను కాపాడుకోవాలన్నారు.

సేవలు నిర్వీర్యం!

- సచివాలయం ఉద్యోగులను కుదిస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే ఉత్తర్వులు జారీ
- బదిలీల్లోనూ రాజకీయ జోక్యం

బండిఆత్మకూరు: ప్రభుత్వ సేవలను ప్రజల ముందుకు తీసుకొస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టేసింది. ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను కుదిస్తోంది. దీంతో ప్రజలు చాలావరకు పనులకు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వాట్సాప్‌లో 161 సేవలను తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకున్నా, వాటిని ఎలా వినియోగించుకోవాలో ఇప్పటికీ చాలామందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో 590 మంది ఉద్యోగులు

నియోజకవర్గ వ్యాప్తంగా 67 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా, వాటిలో 590 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చి గత నెల 31న ఐదేళ్లు పూర్తికావడంతో ఉద్యోగులను తగ్గించేలా ఉత్తర్వులను తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ప్రజలకు నిస్వార్థమైన సేవలు సకాలంలో అందించేవారు. అటువంటి వ్యవస్థలో హేతుబద్ధీకరణ అంటూ ఉద్యోగులను తగ్గించేస్తున్నారు. ఒకే సచివాలయంలో ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

కుదింపు ఇలా..

కూటమి ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలను ఒకేసారి చేస్తోంది. ఇప్పటికే ఈ విషయమై సూచనలు చేసిందని అధికారులు చెబుతున్నారు. జనాభా ప్రకారం సచివాలయాలను కొన్ని కేటగిరీలుగా విభజించింది. ఏ–కేటగిరీలో ఆరుగురు, బీ–కేటగిరీలో ఏడుగురు, సీ–కేటగిరీలో 8 మంది ఉద్యోగులను ఉంచేలా నిర్ణయించారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో 8 నుంచి 12 మంది వరకు ఉద్యోగులు పనిచేసేవారు. నేడు కూటమి ప్రభుత్వం 6 నుంచి 8 మంది ఉద్యోగులు పనిచేసేలా కుదింపు చేసింది.

బదిలీల్లో వీరికి ప్రాధాన్యం

కూటమి ప్రభుత్వం సచివాలయం ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో కొంతమందికి ప్రాధాన్యమిస్తున్నారు. అంధులు, మానసిక దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులు, 40 శాతం అంగవైకల్యం ఉన్నవారు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారితో పాటు గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. మిగతా వారి బదిలీల్లోనూ రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే, మంత్రి సిఫార్స్ లెటర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండేలా గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటిలో ప్రధానంగా సచివాలయ వ్యవస్థ అని చెప్పక తప్పదు. అన్ని రకాల సేవలు ప్రజలకు దక్కేలా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అటువంటి సచివాలయ వ్యవస్థలో హేతుబద్ధీకరణలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు చర్యలు చేపట్టింది.



బండిఆత్మకూరు సచివాలయం

నియోజకవర్గం వారిగా వివరాలు..

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు
మహానంది	11	106
ఆత్మకూరు(రూరల్)	15	124
ఆత్మకూరు(పట్టణం)	13	108
బండిఆత్మకూరు	15	137
వెలుగోడు	13	115
మొత్తం	67	590

త్వరలో బదిలీలు

సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తాం. ఐదేళ్ల పాటు ఒకేచోట సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ అయ్యాయి. గత నెల 31తో సచివాలయ ఉద్యోగుల గడువు ఐదేళ్లయింది. ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి.
– ఎం.దస్తగిరి, ఎంపీడీఓ, బండిఆత్మకూరు

'ఆశా'లకు దరఖాస్తుల ఆహ్వానం

వెలుగోడు: ఆశా వర్కర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ వెలుగోడు పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో 1 పోస్టు ఖాళీగా ఉందన్నారు. గ్రామ నివాసి, కనీసం 10వ తరగతి పాసై ఉన్నవారు ఈనెల 30లోపు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొత్తపల్లి: మండలంలో ఎర్రమఠం గ్రామ పంచాయతీ పరిధిలో ఆశా కార్యకర్తల ఉద్యోగ భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎర్రమఠం వైద్యాధికారి జబ్బీర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనాలగూడెం గ్రామంలో ఒక వర్కర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తును వచ్చే నెల 2లోపు ఆరోగ్య కేంద్రంలో అందజేయాలన్నారు.

పంట కాలువలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: సిద్ధాపురం చెరువుకు వెలుగోడు రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేసి దాదాపు పదేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు పంట కాలువలు పూర్తి చేయకపోవడం శోచనీయమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, మండల అధ్యక్ష కార్యదర్శులు పి.మాబాషా, వీరన్న అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ సిద్ధాపురం చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం సందర్భంగా ఆనాటి, ఈనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారన్నారు. కానీ ఇంతవరకు పంట కాలువలను పూర్తి చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా చెరువు కింద పంట కాలువలను ఏర్పాటు చేసి నీరు అందించాలన్నారు.

మల్లన్న సేవలో ఐఏఎస్ అధికారి


శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను కేంద్ర ఉద్యానవన కమిషనర్ ప్రభాత్ కుమార్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వీరికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఐఏఎస్ అధికారి దంపతులు మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో ఐఏఎస్ అధికారి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామి వారి జ్ఞాపికను అందించి సత్కరించారు.




మల్లన్న సన్నిధిలో ఐఏఎస్ అధికారి

'యోగాంధ్ర'లో పాల్గొనకపోయినా సర్టిఫికెట్ల జారీ

జూపాడుబంగ్లా: 11వ అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేసిన లీలలు అన్నీ ఇన్నీ కావు. మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన చాకలి నాగభూషణం ఈనెల 21న విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనలేదు. అయినా అతను కార్యక్రమంలో పాల్గొన్నట్లు సెల్‌ఫోన్ వాట్సాప్‌కు మెసేజ్‌తో పాటు సర్టిఫికెట్ జారీ చేయటంతో అతను అవాక్కయ్యారు. ఈసందర్భంగా ఆయన 'సాక్షి' తో మాట్లాడుతూ తాను విశాఖపట్నం వెళ్లలేదని, అస్సలు యోగాంధ్ర కార్యక్రమంలో ఒక్కరోజు కూడా పార్టిసిపేట్ చేయలేదని తెలిపారు. అయినా తన వాట్సాప్‌కు యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగస్వాములైనందుకు గాను సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు మెసేజ్ వచ్చిందన్నారు. కాగా మండల పరిధిలో 16,086 మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. అందులో 1,168 మందికి వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటిదాకా 1,002 మందికి జారీచేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



సర్టిఫికెట్



సి.నాగభూషణం సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి

- మరొకరికి గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన కుమార్ నాయక్ (24) తన సోదరి కుమారైతో కలిసి ద్విచక్రవాహనంపై నెరవాడకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జలదుర్గం వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతివేగంతో ఢీకొట్టింది. ప్రమాదంలో కుమార్ నాయక్ లారీ టైర్ల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సోదరి కుమారైకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీ టైర్ల కింద పడిన కుమార్ నాయక్

రుద్రవరం రేంజి అధికారి బదిలీ



రేంజర్‌కు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

రుద్రవరం: అటవీశాఖ రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. శనివారం ఆయన రిలీవ్ అవుతున్న సందర్భంగా రేంజి పరిధిలోని సిబ్బంది రుద్రవరం అటవీ కార్యాలయంలో ఆయనకు శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో కొత్తగా రేంజర్‌ను నియమించకపోవడంతో రుద్రవరం రేంజిలో డిప్యూటీ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న ముర్తుజావలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన రేంజర్‌తో పాటు ఇన్‌చార్జి రేంజర్‌కు అభినందనలు తెలిపారు.

ఆసియాన్ అపార్ట్‌మెంట్‌లో చోరీ

- 18 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

కర్నూలు : నగర శివారులోని కొత్త ఈద్గా సమీపంలో ఉన్న ఆసియాన్ అపార్ట్‌మెంట్‌లో అర్బాస్ ఖాన్ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దండుకుని పరారయ్యారు. ఈయన కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తారు. ఈనెల 24వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో పెళ్లికి వెళ్లారు. ఇదే ఇంట్లోనే అన్న, వదిన కూడా ఉంటారు. 26వ తేదీన వదిన డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లగా ఆమె భర్త ఉద్యోగ రీత్యా ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి గదిలోని వెళ్లి బీరువాలో ఉన్న 18 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. అర్బాస్ ఖాన్ శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచిఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడివుండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ క్రైం పార్టీ సిబ్బందితో అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సిబ్బందిని రప్పించి ఆధారాలను సేకరించారు. అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ముందు రోజు నుంచి పనిచేయడం లేదని తేలింది. వాచ్‌మెన్ కూడా అపార్ట్‌మెంట్ నిర్వాహకుల అనుమతితో ముందు రోజు పనిమీద వేరే ఊరికి వెళ్లాడు. దీంతో వాచ్‌మెన్ పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అర్బాస్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



దొంగలు బీరువాను బద్దలుకొట్టిన దృశ్యం

పక్కా ఇళ్ల మంజూరుకు కృషి

నందికొట్కూరు: దివ్యాంగుల విన్నపం మేరకు ఇంటి స్థలంతో పాటు పక్కాగృహాల మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. శనివారం నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో అసెస్మెంట్ ఏడీఐపీ పథకం ద్వారా వికలాంగులు, వృద్ధులకు ఉచిత పరికరాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్

వెలుగోడు: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ చార్జీలను తగ్గించుకోవాలని ఏఈ రవీంద్ర నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్‌యోజన పథకం అవగాహన పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కిలో వాట్ సామర్థ్యం రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.30 వేల రాయితీ, రెండు కిలో వాట్లకు రూ.60,000, మూడు కిలోవాట్లకు రూ.78,000 రాయితీ లభిస్తుందన్నారు.

పనిభారం తగ్గించాలి

వెలుగోడు: పనిభారం తగ్గించాలని మండలంలోని గ్రామ కార్యదర్శులు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఈఓఆర్‌డీ మురారికి వినతిపత్రం అందజేశారు. రోజూ ఉదయం ఆరు గంటలకే గ్రామాల్లో విధులకు హాజరై .. ఫొటో దిగి దానిని పంచాయతీ శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను నిరసిస్తూ శనివారం వారు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులపై విపరీతమైన పని ఒత్తిడి పెడుతున్నారని, గతంలో వలంటీర్లు చేసిన చిన్నచిన్న సర్వే పనుల భారమంతా తమపైనే పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు నాగేంద్రగౌడు, సుంకన్న, నాగేశ్వరరెడ్డి, నాగరాజు, హసన్, నసిమా పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామానికి చెందిన మహిళ శంషాద్‌పై దాడి చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన శంషాద్ అనే మహిళ రహదారి వెంట బర్రెలు తోలుకెళ్తుండగా.. ఆటో రఫీ, వలితో పాటు మరో ఇద్దరు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేసినట్లు మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. గాయపడిన శంషాద్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అప్పు చెల్లించలేదని మహిళపై దాడి

నంద్యాల(అర్బన్): అప్పు చెల్లించే విషయంలో మండలం అయ్యలూరు మెట్టకు చెందిన అనురాధపై ఎల్లా మహేష్, మరో నలుగురు దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. అనురాధ, భర్త బ్రహ్మంనాయుడు, ఎల్లా మహేష్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నారు. తిరిగి చెల్లించే విషయంలో ఇరువురు ఘర్షణ పడ్డారన్నారు. అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

రోడ్లపైనే వాహనాలు

- రాకపోకలకు అంతరాయం

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో పార్వతీపురం ముఖద్వారం వద్ద సీసీ రోడ్డు వేస్తున్నారు. అయితే కొందరు ప్రైవేటు లాడ్జీల వారి రూముల కోసం వచ్చిన వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక అధికారులు, పోలీసులు స్పందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎస్‌ఆర్‌ఎంఓ బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బీవీ సతీష్‌కుమార్ మళ్లీ బదిలీ అయ్యారు. ఆయనను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సాధారణ బదిలీల్లో భాగంగా ఐదు రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ బీవీ రావు బదిలీపై గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో బీవీ సతీష్‌కుమార్ వచ్చిన వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోయారు. ప్రస్తుతం సీఎస్‌ఆర్‌ఎంఓగా ఇంకా ఎవ్వరినీ నియమించలేదు.



చిన్నకోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: కొద్దిరోజులుగా భక్తులు లేక వెలవెలబోయిన ఆలయ ప్రాంగణాలు శనివారం వీకెండ్ సందర్భంగా కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కోనేరులా స్నానాలాచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఆలయ తలుపులు మూసే వరకు, తిరిగి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

కట్టెల కోసం వెళ్లి తప్పిపోయిన వృద్ధురాలు

- పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది రంగప్రవేశంతో సురక్షితంగా ఇంటికి..

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలానికి చెందిన వృద్ధురాలు అడవిలో తప్పిపోయింది. పోలీసులు, అటవీశాఖ సిబ్బంది స్పందించి ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీశైలం కొత్తపేటకు చెందిన తెలుగు అమ్మమ్మ తన అల్లుడు, మనవడితో కలిసి మల్లమ్మ కన్నీరు వైపు అడవిలోకి శుక్రవారం సాయంత్రం కట్టెల కోసం వెళ్లింది. తెలుగు అమ్మమ్మ దారి తప్పిపోయి అడవిలో కనబడ లేదని వారి బంధువులు శ్రీశైలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ జి.ప్రసాదరావు, సిబ్బంది, శ్రీశైలం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఠాగూర్, ప్రొటక్షన్ వాచర్లు వృద్ధురాలి బంధువులతోకలిసి రాత్రి గాలింపు చేపట్టారు. శనివారం ఉదయం 10 గంటలకు మిద్దెల గుడి వద్ద ఆమె ఆచూకీ కనుకొని సురక్షితంగా తీసుకురావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



వృద్ధురాలితో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది



అరటి తోటలో మేస్తున్న పశువులు

రైతు కష్టం పశువుల పాలు...!

మహానంది మండలంలో ఇటీవల ఈదురు గాలులకు 1,100 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరగడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి కష్టించి పండించిన పంట దిగుబడులు చేతికి వస్తాయనుకునే లోపు నేలకొరగడంతో పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తిమ్మాపురం – జమాలయ్యదర్గా మార్గంలో ఓ అరటి పొలంలో నేలకూలిన చెట్లు పశువులకు మేతగా మారాయి. – మహానంది

ఆర్థోపెడిక్ వైద్యుడు డీవీ రమణ మృతి



కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, సిరినోబుల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ డీవీ రమణ కన్నుమూశారు. శనివారం ఉదయం ఆయన అశోక్‌నగర్‌లోని తన ఇంట్లో ఉండగానే తీవ్ర గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందారు. పత్తికొండకు చెందిన ఈయన ఎంబీబీఎస్‌ను 1976లో కర్నూలు మెడికల్ కాలేజీలో, అనంతరం సీఎంసీ వేలూరులో ఆర్థోపెడిక్ పీజీ చదివారు. ఎముకల డాక్టర్‌గా ఆయన కర్నూలుతో పాటు జిల్లా ప్రజలకు ఎంతో సుపరిచితులు. ఎస్‌ఆర్ పేటలో మొదటగా ప్రైవేటు నర్సింగ్‌హోమ్ ప్రారంభించారు. ఆయన మృతి పట్ల వైద్యులు, మెడికల్‌రెప్‌లు తీవ్ర సంతాపం తెలిపారు.

'జూపాడుబంగ్లా ఎత్తిపోతల' నుంచి సాగునీరు విడుదల

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా–1, 2 ఎత్తిపోతల పథకం నుంచి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య శనివారం సాగునీటిని విడుదల చేశారు. రెండు మోటార్ల స్విచ్ ఆన్‌చేసి 45 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల శ్రీశైలం బ్యాక్‌వాటర్ రావటం హర్షించదగిన విషయమన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేసే సాగునీరు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు పాల్గొన్నారు.

రెండు మోటార్లు రిపేరీ

జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం–1, 2 కింద ఐదు మోటార్లు ఉండా రెండు మోటార్లు మరమ్మతులకు గురికాగా కేవలం మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. జూపాడుబంగ్లా–1 ఎత్తిపోతల పథకం కింద మూడు మోటార్లు ఉండగా 5,200 ఎకరాల ఆయకట్టు ఉంది. మూడు మోటార్లు సక్రమంగా పనిచేస్తేనే పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం ఓ మోటారు మరమ్మతులకు గురికాగా కేవలం రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. జూపాడుబంగ్లా–2 ఎత్తిపోతల పథకం కింద రెండు మోటార్లు ఉండగా 4,089 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు మోటార్లు పనిచేస్తేనే పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. అయితే రెండు మోటార్లలో ఓ మోటారు మరమ్మతులకు గురికాగా ఓ మోటారు మాత్రమే పనిచేస్తుంది. దీంతో పూరిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.